సాక్షి
కుమురంభీం

శనివారం ౹ 21 ౹ సెప్టెంబర్ ౹ 2024



కొత్తసార్లు వచ్చేదెప్పుడో..
డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. నియామక ప్రకియ పూర్తయితే ఉమ్మడి జిల్లాలో బోధకుల కొరత తీరనుంది. 8లో▸



పౌష్టికాహారం.. ఆరోగ్యం
జిల్లాలో 'పోషణ్ మాసం' కొనసాగుతోంది. రక్తహీనత, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /25.3

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

లాభాల వాటా 33శాతం

- క్రితంసారి కంటే 1శాతం అదనం
- ఒక్కో కార్మికునికి సుమారు రూ.1.90 లక్షలు
- రీజియన్‌లో 14,664 మంది కార్మికులకు లబ్ధి
- కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేలు
- లాభాల్లో నుంచే వరద బాధితులకు సహాయం



విజయ సంకేతం చూపుతున్న కార్మికులు(ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సంస్థ లాభాలు, అందులో కార్మికులకు చెల్లించే వాటాపై ఎట్టకేలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత ఆర్థిక సంవత్సరం 2023–24లో సంస్థ రూ.4,701 కోట్ల లాభాలు గడిచింది. అందులో పెట్టుబడులు పోను నికరంగా రూ.2,412 కోట్లు లాభాలు చూపించింది. ఈ మొత్తం నుంచి ఈ ఏడాది 33శాతం వాటా కింద రూ.796 కోట్లు కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. దీంతో సీనియర్ కార్మికునికి సగటున సుమారు రూ.1.90లక్షల వరకు రానున్నాయి. ఇదిలా ఉండగా.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.2,222 కోట్ల లాభాలు ఆర్జించగా అందులో నుంచి 32శాతంగా రూ.711 కోట్లు పంపిణీ చేశారు. లాభాలు, వాటా శాతం పెరగడంతో క్రితంసారితో పోల్చితే ఈసారి అదనంగా రూ.20వేలు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ డబ్బులు దసరాకు ముందు కార్మికుల ఖాతాల్లో జమ చేస్తారు. నిర్దిష్ట తేదీ ఇంకా ప్రకటించలేదు. కాగా, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధి బెల్లంపల్లి రీజియన్‌లో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి పరిధిలోని 14,664 మంది కార్మికులు లాభాల వాటా పొందనున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఘన విజయం

లాభాల వాటా సాధనతో కాంట్రాక్టు కార్మికుల పోరాటం ఫలించింది. శాశ్వత కార్మికులతో సమానంగా పని చేస్తూ సంస్థ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కృషి చేస్తున్న తమకు కూడా లాభాల వాటా ప్రకటించాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం, యాజమాన్యం సానుకూలంగా స్పందించి మొదటిసారిగా కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల బోనస్ ప్రకటించింది. ఒక్కో కార్మికునికి రూ.5వేలు చెల్లిస్తామని పేర్కొంది. కార్మికులకు పంపిణీ చేసే 33శాతం వాటా పోను మిగతా 67శాతం నుంచి ఈ మొత్తాన్ని పంపిణీ చేస్తారు. కంపెనీ వ్యాప్తంగా సుమారు 27వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. వీరికి సుమారు రూ.13కోట్లు చెలించనున్నారు

లాభాల్లో నుంచే వరద బాధితులకు..

వరద బాధితులకు సింగరేణి సంస్థ రూ.10.25 కోట్లు విరాళం ప్రకటించింది. కార్మికుల ఒక రోజు బేసిక్ వేతనాల నుంచి రికవరీ చేయాలని యాజమాన్యం నిర్ణయించగా.. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు వ్యతిరేకించారు. కంపెనీకి ఇన్ని లాభాలు రాగా కార్మికుల వేతనాల నుంచి చెల్లించడం సరికాదని, కార్మికులకు పంపిణీ చేయగా మిగిలిన 67శాతం లాభాల్లో నుంచి వరద సహాయం చేయాలని డిమాండ్ చేయగా యాజమాన్యం ఒప్పుకుందని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య తెలిపారు.

కేఎల్ మహేంద్రతో మొదలై..

సింగరేణిలో కార్మికులకు లాభాల వాటా పంపిణీ హక్కు నాటి ఏఐటీయూసీ దివంగత నేత కేఎల్ మహేంద్రతో మొదలైంది. 1999లో ఎల్లందులోని కోయగూడెం ఓసీపీలో సర్ఫేస్ మైనర్ యంత్రం ప్రవేశపెట్టిన సందర్భంగా కార్మికులు వ్యతిరేకిస్తూ సమ్మెలోకి దిగారు. దీంతో అప్పటి సీఎం చంద్రబాబు ఏఐటీయూసీ నేతలను చర్చలకు పిలిచారు. సమ్మె చేస్తే సంస్థకు నష్టం వస్తుందని, కార్మికుల వేతనాల్లో కోత విధిస్తామని హెచ్చరించారు. లాభాలు వస్తే కార్మికులకు పంచుతారా అని చర్చల్లో పాల్గొన్న ఏఐటీయూసీ నేత కేఎల్ మహేంద్ర 'బాబు'ను ప్రశించగా మొండితనంతో సరే అన్నారు. చివరికి తర్వాత సంవత్సరం లాభాలు రావడంతో చేసేది లేక వచ్చిన లాభాల నుంచి వాటా చెల్లించడం మొదలై హక్కుగా మారింది. మొదట 10శాతం వాటాతో మొదలై కొన్నేళ్లు అంతే కొనసాగుతూ రాగా తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన వైఎస్.రాజశేఖర రెడ్డి దాన్ని ఏకంగా 16శాతానికి పెంచారు. దానికి అనుగుణంగా ఆ తర్వాత వచ్చిన సీఎంలు ఒక్కోశాతం పెంచుకుంటూ రావడంతో నేడు 33 శాతానికి చేరింది.

కార్మికుల సంఖ్య

సింగరేణి మొత్తం: **41837**

శ్రీరాంపూర్: **8810**
మందమర్రి: **4858**
బెల్లంపల్లి: **996**

లాభాల వాటా వివరాలు

సం.	లాభం (రూ. కోట్లు)	శాతం	చెల్లించినవి (రూ. కోట్లు)
2010–11	286.01	16	56.16
2011–12	358.27	17	60.09
2012–13	401	18	72.18
2013–14	418	20	83.60
2014–15	490.44	21	103.11
2015–16	1006.13	23	245.21
2016–17	395.38	25	98.85
2017–18	1212.75	27	326.25
2018–19	1766.44	28	493.82
2019–20	993.86	28	278.26
2020–21	272.64	29	79.06
2021–22	1227.04	30	368
2022–23	2222	32	711
2023–24	2412	33	796

కాంట్రాక్ట్ కార్మికులకు కూడా హక్కు పుట్టించాం



మొదటగా 1999లో పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో వాటా హక్కు పుట్టించింది మా గుర్తింపు సంఘం హయాంలోనే. నేడు కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల బోనస్‌ను పుట్టించాం. కార్మికులకు ఇచ్చిన మాటా మేరకు లాభాల వాటా పెంచి ఇచ్చాం. ప్రభుత్వం, యాజమాన్యం కూడా మా విన్నపానికి సానుకూలంగా స్పందించాయి.

– సీతారామయ్య, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు

న్యూస్‌రీల్

1న పురస్కారాలు ప్రదానం

ఆసిఫాబాద్: జిల్లాలో విశిష్ట సేవలందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి అడెపు భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 25న సాయంత్రం 5 గంటల లోగా హైదరాబాద్‌లోని మలక్‌పేటలోని నల్గొండ క్రాస్ రోడ్డు బస్టాప్ సమీపంలో గల దివ్యాంగుల సంక్షేమ భవన్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, అర్హతలు, పురస్కారాల కేటగిరీ, ఇతర వివరాలకు www.wdsc.telangana.gov.inను సందర్శించాలని సూచించారు.

జోనల్‌స్థాయికి విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటాలన్నారు. అండర్ 14, 17 జిల్లాస్థాయి బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వందమంది విద్యార్థుల పాల్గొన్నారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 18 మంది బాలబాలికలు జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, పీడీ పీఈటీలు మధుసూదన్, విద్యాసాగర్, శారద పాల్గొన్నారు.

ఒప్పంద ప్రాతిపదికన పోస్టులు భర్తీ



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు, డీఎంహెచ్‌వో తుకారాం భట్

ఆసిఫాబాద్: జాతీయ ఆరోగ్య పథకం కింద జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఎంహెచ్‌వో తుకారాం భట్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడు స్టాఫ్ నర్సు, ఐదు ల్యాబ్ టెక్నీషియన్, ఆరు పారా మెడికల్ సహాయ సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేశామని అదనపు కలెక్టర్ వెల్లడించారు. ఎంపికైన వారు నిబద్ధతతో విధులు నిర్వర్తించి రోగులకు సేవలందించాలని సూచించారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి



బస్సులో ప్రయాణికుడికి పువ్వు ఇస్తున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్: ఆర్టీసీ సిబ్బంది బస్సులు, బస్టాండ్లలో ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. ఆర్టీసీ మర్యాద దినోత్సవం సందర్భంగా శుక్రవారం బస్సుల్లో ప్రయాణికులకు పూలు అందించారు. డీఎం మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బంది ప్రయాణికులను చిరునవ్వుతో పలకరించాలన్నారు. ప్రతినెలా మూడో శుక్రవారం మర్యాద దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

అధికారులపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: ఆర్టీఐ కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు అష్రఫ్‌పై నివేదిక ఇచ్చిన జిల్లాస్థాయి కమిటీపై శుక్రవారం కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. 11 అంశాలపై జిల్లాస్థాయి కమిటీ తప్పుడు నివేదిక ఇచ్చి కేసును తప్పుదోవ పట్టించిందని అష్రఫ్ ఫిర్యాదు చేయడంతో అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.రాజేశం, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్, బీసీ అభివృద్ధిశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, మైనార్టీ జిల్లా ఇన్‌చార్జి అధికారి షేక్ మహ్మద్, వ్యవసాయశాఖ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్‌రావు, డీఐఈవో జి.శ్రీధర్‌పై 166, 166ఎ, 167, 464, 500, 501 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తదితరులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పౌష్టికాహారంతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. పోషణ మాసంలో భాగంగా శుక్రవారం మండలంలోని దరోగపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామాల్లో పౌష్టికాహారం ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. గర్భిణులు, మహిళలు, కిశోర బాలికలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనతను తగ్గించేందుకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని సూచించారు. అంతకుముందు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, సూపర్‌వైజర్లు హసీనా, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె



సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావుకు సమ్మె నోటీసు అందించారు. మున్సిపల్ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు పెరక శ్రీకాంత్ మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలు, ఏరియర్స్ చెల్లించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పరిష్కారం కాలేదన్నారు. ఈ నెల 25 నుంచి సమ్మెబాట పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి, సంఘ ప్రతినిధులు మాట్ల రాజు, తోట సమ్మయ్య, బాపురావు, సీహెచ్ శంకర్, ప్రభాకర్, రాజు, మల్లేశ్, ఇస్తారి, సురేశ్ పాల్గొన్నారు.

నేడు బంద్!

- రాష్ట్ర బంద్‌కు 'రాయిసెంటర్' పిలుపు
- జిల్లాలో పకడ్బందీగా పోలీసు బందోబస్తు
- 850 మంది పోలీసులతో పహారా
- జైనూర్‌లో 144 సెక్షన్.. సరుకులు అందించేందుకు ఏర్పాట్లు
- ఏడు మండలాల్లో 30 చోట్ల పికెట్లు

సాక్షి, ఆసిఫాబాద్: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన ఘటనకు నిరసనగా నేడు జిల్లాలో బంద్ కొనసాగనుంది. ఆదివాసీల్లోని తొమ్మిది తెగలు కలిసి రాయిసెంటర్ వ్యవస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పకడ్బందీగా బందోబస్తు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలోని ఆసిఫాబాద్, తిర్యాణి, వాంకిడి, జైనూర్, లింగాపూర్, కెరమెరి, సిర్పూర్(యూ) మండలాల్లో పోలీసుల పహారా ఉండనుంది. ఆయా మండలాల్లో పికెట్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేకంగా జైనూర్‌లో 144 సెక్షన్ కొనసాగిస్తూనే.. నిత్యావసర సరుకుల కోసం ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓ వాహనం ద్వారా నిత్యావసరాలు అందించే ఏర్పాట్లు చేశారు.

బాధిత మహిళ కోసం..

ఆదివాసీ మహిళపై ఆటోడ్రైవర్ భౌతికదాడికి యత్నించిన నేపథ్యంలో జైనూర్‌లో ఇరువర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. బాధిత మహిళకు న్యాయం జరగాలని, రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఆదివాసీల సమస్యలను సర్కారు పరిష్కరించాలని, ఈ నెల 30లోగా ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో గవర్నర్ పర్యటించాలని రాయిసెంటర్ డిమాండ్ చేసింది. ఈ నెల 18న ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ప్రజాదర్బార్‌లో రాయిసెంటర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో 21న రాష్ట్రబంద్ చేపట్టాలని తీర్మానం చేశారు.

జైనూర్‌లో 144 సెక్షన్ కొనసాగింపు...

ఆదివాసీ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో జైనూర్‌లో పోలీసులు 144 సెక్షన్ కొనసాగిస్తున్నారు. ఈ నెల 4 నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంది. బంద్ నేపథ్యంలో మరోసారి ఎలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీసు బాస్ పటిష్ట చర్యలు తీసుకున్నారు. బయట వ్యక్తులు ఎవరూ జైనూర్‌లోకి రాకుండా ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అయితే నిత్యావసరాల కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తులు మొదలుకొని ఇతర నిత్యావసర సరుకులు ఓ వాహనంలో తీసుకొచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు.

పటిష్ట బందోబస్తు..

బంద్ నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న 600 మంది పోలీసులు, బయట ప్రాంతం నుంచి వచ్చిన మరో 250 మంది సిబ్బందితో కలిపి మొత్తం 850 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. వాహనాలతో నిఘా ఉంచుతున్నారు. సున్నిత మండలాలైన ఆసిఫాబాద్‌లో నాలుగు చోట్ల పికెట్లు, వాంకిడిలో నాలుగు చోట్లు, తిర్యాణిలో మూడు చోట్ల, లింగాపూర్‌లో మూడు చోట్ల, సిర్పూర్(యూ)లో నాలుగు చోట్ల, జైనూర్‌లో 12 చోట్ల పికెట్లు ఏర్పాటు చేశారు.

నివురుగప్పిన నిప్పులానే..

జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన ఘటన నేపథ్యంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం కాస్త హింసాత్మకంగా మారి ప్రతీకార చర్యలకు దారితీసింది. ఇరువర్గాలకు భారీగా ఆస్తినష్టం జరిగింది. పట్టణంలో పోలీసులు 144 సెక్షన్‌ను విధించారు. ఇప్పుడిప్పుడే అక్కడ ప్రశాంత వాతావరణం నెలకొంటోంది. అయితే గత 18 రోజులుగా పాఠశాలలు అక్కడ మూతపడ్డాయి. దుకాణాలేవీ తెరచుకోలేదు. అగ్నికి ఆహుతైన దుకాణాలను శుభ్రం చేసినా దుకాణాదారులు ఎవరూ తెరిచే సాహసం చేయకపోవడంతో స్థానికులు నిత్యావసరాల కోసం ఉట్నూర్‌కు వెళ్తున్నారు. రోజూ ఆటోల్లో ఉట్నూర్‌కు వెళ్లి కూరగాయలు, ఇతర సరుకులు తెచ్చుకుంటున్నారు. ఒకవర్గం అక్కడ ఉండరాదని ఆదివాసీలు తెగేసి చెబుతున్న నేపథ్యంలో అక్కడ నివురుగప్పిన నిప్పులానే పరిస్థితి ఉంది.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో విక్రమ్, అన్షిత, రేవంత్, హారిక, జశ్వంత్, శాన్వి, రాజేశ్వర్, నిఖిల్ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. వీరు ఈ నెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఆగని అక్రమ దందా!

- పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం
- నిత్యం పట్టుబడుతున్నా.. అడ్డుకట్ట పడని వైనం
- తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో విక్రయం
- లాభాలు గడిస్తున్న అక్రమార్కులు



పెంచికల్‌పేట్‌లో పట్టుబడిన బియ్యంతో అధికారులు (ఫైల్)

బెజ్జూర్(సిర్పూర్): పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. రాజకీయ అండదండలతో కొంతమంది దళారులు అక్రమంగా పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాగజ్‌నగర్ పట్టణం మహారాష్ట్రకు సమీపంలో ఉండటంతో రేషన్ బియ్యం పెద్దఎత్తున సరిహద్దు దాటుతోంది. రైలు, రోడ్డు మార్గాల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నారు. గ్రామాల్లో బియ్యాన్ని సేకరించి అదును చూసి లారీలు, ఐచర్ వ్యాన్లు, బైక్‌ల ద్వారా కూడా తరలిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దళారులు గ్రామాల్లో తిరుగుతూ లబ్ధిదారుల నుంచి కిలో రూ.8 నుంచి రూ.12 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యం క్వింటాళ్ల చొప్పున అక్రమంగా రవాణా చేసి మహారాష్ట్రలోని వీరూర్, బల్లార్షా, చంద్రాపూర్, అహేరి, ఆళ్లపల్లిల్లోని దుకాణాలకు చేరవేస్తున్నారు. అక్కడ క్వింటాల్‌కు రూ.2100 నుంచి రూ.2500 వరకు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు.

నేతల అండదండలతో..!

కాగజ్‌నగర్ ప్రాంతానికి చెందిన కొందరు నేతల అండదండలతో ఈ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. కాగజ్‌గర్ రైల్వే స్టేషన్ ఏరియా, చింతగూడ, నవేగాం బస్తీ ఏరియాల నుంచి సిర్పూర్(టి) మీదుగా మహారాష్ట్రకు సరఫరా చేస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. నెలకు కేవలం ఒకటి, రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారు. అది కూడా అసలు సూత్రధారులు కాకుండా, డ్రైవర్లు, కొందరు వ్యక్తులపై కేసులు నమోదు చేస్తుండటం గమనార్హం.

డీలర్లపై ఆరోపణలు

సబ్సిడీ బియ్యం పక్కదారి పట్టించకుండా ఉండేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ యంత్రాలు తీసుకువచ్చినా దందా మాత్రం ఆగడం లేదు. కొంతమంది లబ్ధిదారులు వేలిముద్రలు వేసి బియ్యం అక్కడే డీలర్లకు విక్రయిస్తున్నారు. ప్రతినెలా 1 నుంచి 15 వరకు బియ్యం పంపిణీ ఉంటుంది. ఒక షాపునకు ఆ నెలలో వచ్చిన కోటా ఎంత..? వినియోగదారులు తీసుకున్నవి ఎంత..? మిగిలిన కోటా ఎంత..? అనే లెక్కలు సులువుగానే తెలుస్తాయి. కానీ పౌరసరఫరాల శాఖాధికారులు మాత్రం షాపులు ఏ మాత్రం తనిఖీ చేయడం లేదు. కొంతమంది డీలర్లు నేరుగా షాపుల నుంచి అమ్మేస్తున్నారు. రేషన్ బియ్యం దందాపై టాస్క్‌ఫోర్ సీఐ రాణాప్రతాప్‌ను వివరణ కోరగా.. పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శాఖపరమైన చర్యలు తీసుకుంటామని, అక్రమ రవాణా, నిల్వలు ఉంటే సమాచారం అందించాలని కోరారు.

సరిహద్దుల్లో ప్రత్యేక దుకాణాలు..

తెలంగాణకు చెందిన రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి సన్నబియ్యంగా మార్చి మహారాష్ట్రలో విక్రయిస్తున్నారు. అలాగే ఫార్మా కంపెనీలు, కోళ్ల ఫారాల్లో దాణా కోసం, మద్యం తయారీ కంపెనీలకు కూడా అక్రమ మార్గంలో వెళ్తున్నాయి. కొన్నిచోట్ల నూకలుగా మార్చి తీసుకెళ్తున్నారు. సిర్పూర్(టి) మండలం నుంచి వెళ్తే పెన్‌గంగ నది ఒడ్డున మహారాష్ట్రలో చెందిన పోడ్సా ఉంటుంది. ఇక్కడ పదుల సంఖ్యలో బియ్యం కొనుగోలు దుకాణాలు వెలిశాయి. మరో 25 కిలోమీటర్లు వెళ్తే గోండుపిప్రి, గోండియా, వీరూర్‌లోనూ బియ్యం కొనుగోలు దుకాణాలు అనేకం ఉన్నాయి. చింతలమానెపల్లి మండలం గూడెం నుంచి, అలాగే బెజ్జూర్ మండలం సోమిని, మొగవెల్లి, గూడెం మీదుగా అక్రమ రవాణా సాగుతోంది. అక్కడ భారీ గోదాములు ఏర్పాటు చేసి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు వాంకిడి మీదుగా కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ) నుంచి జివితి మీదుగా వీరూర్‌కు అక్రమ రవాణా సాగుతోంది. తెలంగాణలో తక్కువ ధరతో కొనుగోలు చేసి కిలోకు రూ.18 నుంచి రూ.22 వరకు చెల్లిస్తున్నారు.

ఇటీవలి ఘటనలు

- కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి) మండలం మీదుగా మహారాష్ట్రలోని అన్నూర్ గ్రామానికి 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్న ట్రాలీ వాహనాన్ని ఈ నెల 15న సిర్పూర్(టి) పోలీసులు పట్టుకున్నారు.
- బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురి ఇళ్లలో చింతలమానెపల్లి ఎస్సై నరేశ్ ఈ నెల 10న దాడులు నిర్వహించారు. 44 క్వింటాళ్ల బియ్యం పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.
- ఇటీవల పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి, అగర్‌గూడ నుంచి అక్రమంగా తరలిస్తున్న 21 క్వింటాళ్ల బియ్యాన్ని స్థానిక పోలీసులు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు.
- కాగజ్‌నగర్ నుంచి లోనవెల్లి మార్గంలో మహారాష్ట్రకు తరలిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల బియ్యం టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- చింతలమానపల్లి మండలం కర్జల్లి గ్రామానికి చెందిన ముగ్గురు, బాబాసాగర్, నందిపేట గ్రామాలకు చెందిన వారు ద్విచక్ర వాహనాలతో మహారాష్ట్ర వైపు తరలిస్తుండగా 11 క్వింటాళ్ల బియ్యాన్ని టాస్క్‌ఫోర్ అధికారులు పట్టుకున్నారు.
- సిర్పూర్ మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద స్థానిక పోలీసులు నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేశారు.
- దహెగాం మండలం ఐనం గ్రామంలో ఇటీవల సుమారు 17 క్వింటాళ్ల బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.
- కాగజ్‌నగర్ మండలం కోచింగ్ గ్రామంలో మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కరీంనగర్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు.

క్లుప్తంగా

వాలీబాల్ విజేత శ్రీరాంపూర్



మొదటి బహుమతి పొందిన శ్రీరాంపూర్ జట్టు

శ్రీరాంపూర్: వాలీబాల్ పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా జట్టు మొదటి బహుమతి సాధించింది. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీలు జరిగాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా జట్టు రామగుండం 3, భూపాల్‌పల్లి జట్టుపై విజయం సాధించింది. ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈసారి కోలిండియా పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, క్రీడల గౌరవ కార్యదర్శి సృజన్‌పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు చాట్ల అశోక్, నరేందర్‌రెడ్డి, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిజన క్రీడోత్సవాల షెడ్యూల్ ఖరారు

ఉట్నూర్‌రూరల్: గిరిజన క్రీడోత్సవాల షెడ్యూల్‌ను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శుక్రవారం ప్రకటించారు. ఆశ్రమ పాఠశాలల బాలబాలికలకు 14, 17 ఏళ్ల విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వాలీబాల్, అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, టెన్నీకాయిట్, ఆర్చరీ, చెస్, క్యారం క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 21న ఆయా పాఠశాలల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 24న ఆయా డివిజన్ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ నెల 27న జోనల్ స్థాయి ఎంపిక పోటీలు ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరచిన వారు నవంబర్ మొదటి వారంలో ఉట్నూర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల విజయవంతానికి ఉమ్మడి జిల్లాలోని డీడీలు, డీటీడీవోలు, క్రీడాధికారులు, ఏటీడీవోలు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సుమలత

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ ఆలయంలో చోరీ చేసిన ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు. మండలంలోని కనకాపూర్ శివారులోని హనుమాన్ ఆలయంలో జగిత్యాల జిల్లా రాయికల్ గ్రామానికి చెందిన గంధం అర్జున్, గంధం నరేష్ చోరీ చేశారు. ఇనుప కడ్డీతో గుడి తాళం పగులగొట్టి హుండీలో ఉన్న రూ.1,500 ఎత్తుకెళ్లారు. శుక్రవారం కనకాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న అర్జున్, నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారిని విచారణ చేయగా కనకాపూర్ ఆలయంలో చోరీ చేసినట్లు వెల్లడించారు. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను /పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ:18K. Ph: 9160900024,9640400073. [H-796277]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185451]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

కొత్తసార్లు వచ్చేదెప్పుడో..



తోటి విద్యార్థిని ద్వారా పాఠ్యాంశాన్ని అభ్యసిస్తున్న విద్యార్థులు(ఫైల్)

- డీఎస్సీ ఫలితాలు ప్రకటించని ప్రభుత్వం
- పరీక్ష నిర్వహించి రెండు నెలలు
- ఫైనల్ కీ విడుదలతోనే సరి..
- ఫలితాలు ప్రకటిస్తే ఉమ్మడి జిల్లాలో 1,295 పోస్టులు భర్తీ

నిర్మల్‌ఖిల్లా: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం సుదీర్ఘకాలంగా ఎదురు చూసిన ఉమ్మడి జిల్లా నిరుద్యోగులకు ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించి శుభవార్త చెప్పింది. దీంతో చాలా మంది పట్టుదలతో సన్నద్ధమయ్యారు. ఏడేళ్ల తర్వాత డీఎస్సీ పరీక్షలను జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు విద్యాశాఖ నిర్వహించింది. దీంతో ఉద్యోగాల భర్తీపై భరోసా ఏర్పడింది. సెప్టెంబర్ 6వ ఫైనల్‌కీ విడుదల చేసింది. ఇక ఫలితాలు ప్రకటించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేసి, తుది ఎంపిక జాబితా విడుదల చేయడంతోపాటు నియామక పత్రాలను అందించాల్సి ఉంది. పరీక్షలను విజయవంతంగా రాసిన నిరుద్యోగులు ఉపాధ్యాయకొలువు వస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. మరోవైపు కొత్తసార్లు ఎప్పుడొస్తారో అని ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

ఖాళీలు ఇలా...

జిల్లాల వారీగా ప్రకటించిన ఖాళీలు పరిశీలిస్తే నిర్మల్‌లో 342, ఆదిలాబాద్‌లో 324, మంచిర్యాలలో 288, ఆసిఫాబాద్‌లో 341 ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,295 ఖాళీలకు దాదాపు 30 వేల మంది డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో డీఎస్సీ పరీక్ష 80 మార్కులకు, టెట్ వెయిటేజీని 20 మార్కులకు నిర్ణయించి, పరీక్షల ఫైనల్ కీని కూడా విడుదల చేయడంతో హాజరైన అభ్యర్థులకు ఉద్యోగ సాధనకు కావాల్సి మార్కులు తేటతెల్లమైంది. అయితే జనరల్ మెరిట్‌లిస్టు విడుదల, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ మిగిలి ఉంది. ఇదంతా పూర్తయితే ఉద్యోగ నియామక పత్రాలను అందజేసేందుకు అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులు కొరత కూడా తీరుతుంది.

మరో డీఎస్సీకి అవకాశం...

ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో గతంలో లెక్కించిన ప్రామాణికతగా మేరకు ఖాళీలను సేకరించారు. అయితే ప్రస్తుతం బదిలీ ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టడం, పదవీ విరమణ గత ఏప్రిల్ నుంచి మొదలు కావడంతో మరిన్ని ఖాళీలు ఏర్పడుతున్నాయి. వీటన్నిటినీ కలుపుకొని కొత్త డీఎస్సీ నిర్వహించనునట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల ప్రకటించారు. ప్రస్తుతం డీఎస్సీ ఫలితాలు ప్రకటిస్తే.. మరో డీఎస్సీ నిర్వహణకు మార్గం సుగమమం అవుతుంది.

ఉమ్మడి జిల్లాలో భర్తీకానున్న పోస్టుల వివరాలు..

జిల్లా	ఖాళీలు
నిర్మల్	342
ఆదిలాబాద్	324
మంచిర్యాల	288
ఆసిఫాబాద్	341
మొత్తం	1,295



సుదూర ప్రాంతాల్లోనే ఎక్కువ ఖాళీలు...

ఆయా నూతన జిల్లాల్లో గత జూన్, జూలై నెలలో నిర్వహించిన బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో సీనియర్ ఉపాధ్యాయులు పట్టణ, సమీప ప్రాంతాలకు బదిలీలలో ప్రాధాన్యం చూపడంతో సుదూర ప్రాంతాలు, పల్లెలు, గిరిజన తండాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. అయితే ఇప్పటికే ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు తాత్కాలికంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. నూతన ఉపాధ్యాయుల పోస్టింగులను ఇస్తే ఆ ఖాళీలన్నీ భర్తీ కానున్నాయి.

ప్రక్రియ కొనసాగుతోంది...



గత జూలైలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఫైనల్ కీ విడుదల చేసింది. విద్యాశాఖ సాధ్యమైనంత మేరకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిచేసి పోస్టింగులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. కొత్త ఉపాధ్యాయులు వస్తే కొరత కూడా తీరుతుంది. పూర్తిస్థాయిలో టీచర్లు అందుబాటులోకి వస్తారు.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

కర్రతో దోమ తయారీ



ప్రభాకర్ కర్రతో తయారు చేసిన బుల్లి దోమ

వేమనపల్లి: తన ప్రతిభతో ఎన్నో కళాత్మక వస్తువులకు జీవం పోస్తున్న నీల్వాయికి చెందిన జంబోజి ప్రభాకర్ ఖాతాలో మరో రికార్డు చేరింది. తాజాగా కర్రతో బుల్లిదోమను తయారు చేశాడు. మానవాళికి ప్రాణాంతకంగా మారిన దోమకు ఒక నిర్మాణం ఇవ్వాలనే ఉద్దేశంతో తయారు చేసినట్లు తెలిపాడు. గతంలో వేప ఆకు నుంచి, ఆ తర్వాత చింతాకు నుంచి చీరను తీశాడు. చిటికెను వేలు సహాయంతో రెండు సైకిళ్లను లేవనెత్తాడు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు వరకు వెళ్లి తృటిలో చేజార్చుకున్నాడు. కుటుంబ ఆర్థిక సమస్యల వల్ల కొన్ని రోజులు తన ప్రతిభను పక్కన బెట్టాడు. గతేడాది వెండితో చిన్న దోమను చేయగా తాజాగా కర్రతో బుల్లి దోమను తయారు చేశాడు.

అక్రమ నిర్మాణాల కూల్చివేతకు రంగం సిద్ధం..?

- ఇళ్ల నంబర్లు తొలగింపు
- నిర్మాణదారుల్లో ఆందోళన



ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇళ్లు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీ పరిధి గెర్రెకాలనీలోని 840 సర్వేనంబరులో గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్ల కూల్చివేతకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పకడ్బందీగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. అక్రమ నిర్మాణాలు అంటూ మున్సిపల్ అధికారులు 34మందికి ఈ నెల 12న నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. నోటీసులు జారీ చేసి వారం రోజులు కావడంతో మున్సిపల్ అధికారులు ఇళ్లకు కేటాయించిన నంబర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ నివేదిక అందజేశారు. కలెక్టరేట్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేయడం, ఇళ్ల నంబర్లు తొలగించడంతో నిర్మాణాల కూల్చివేత తప్పదని ఇళ్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు సైతం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో రెండ్రోజుల్లో రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖల సమన్వయంతో కూల్చివేతను పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

నివేదిక సమర్పించాం..

రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు 840 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చాం. సదరు యజమానులు ఇచ్చిన సంజాయిషీ అసంతృప్తిగా ఉండడంతో నోటీసులు ఇచ్చిన 34 మందికి సంబంధించిన ఇంటి నంబర్లు తొలగించాం. ఈ జాబితా నివేదికను రెవెన్యూ అధికారులకు అందజేశాం.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్, చెన్నూర్

సౌత్‌జోన్ పోటీల్లో పతకాల పంట



విజేతలతో శిక్షకులు, మేనేజర్

ఆదిలాబాద్: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో ఏడు పతకాలతో మెరిశారు. అండర్-14 విభాగంలో ట్రయథ్లాన్-సీ ఈవెంట్‌లో నగేశ్, ట్రయథ్లాన్-బీ ఈవెంట్‌లో కార్తీక్ స్వర్ణ పతకాలు సాధించగా, జావెలిన్ త్రోలో జకేష్ కాంస్య పతకంతో నిలిచాడు. అండర్-16 విభాగంలో జావెలిన్ త్రోలో సతీశ్, 60 మీటర్ల పరుగులో విక్రమ్ కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. అండర్- 20 విభాగంలో హైజంప్‌లో అశ్విని స్వర్ణ పతకంతో మెరవగా, హ్యామర్ త్రోలో వంశీ కాంస్య పతకం సాధించినట్లు ట్రైనర్స్ రాకేశ్, సునంద్, మేనేజర్ రాహుల్ తెలిపారు. విజేతలకు జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, రాజేశ్, పెటా ప్రధానకార్యదర్శి స్వామి, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జ్యోతిస్వరన్ తదితరులు అభినందనలు తెలిపారు.

వ్యభిచార గృహ నిర్వాహకులు అరెస్ట్



విలేకరుల సమావేశంలో అరెస్టు చూపిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగడిలో ఉన్న పద్మావతి కాలనీలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న దంపతులతోపాటు మధ్యవర్తి, విటుడిని, మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. మందమర్రి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పద్మావతి కాలనీలోని ఓ గృహంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేశారు. మహమ్మద్ మొయిన్, సుక్కుల అవంతి దంపతులు మంచిర్యాలలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన పత్తి సత్తమ్మ, విటుడు మంచిర్యాలలోని సున్నంబట్టి వాడకు చెందిన ఆకునూరి సంపత్, ఏలూరుకు చెందిన మరో మహిళ పట్టుబడ్డారు. వారిని విచారించగా సత్తమ్మ ద్వారా మొయిన్, అవంతి గృహంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పత్తి సత్తమ్మ పలువురి అమ్మాయిల ఫొటోలు వాట్సాప్ ద్వారా పంపించి విటులను ఆకర్శిస్తూ పద్మావతి కాలనీలో ఇంటిని వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఇంటి నిర్వాహకులతోపాటు సత్తమ్మ, విటుడు సంపత్‌లను అరెస్ట్ చేశామని, బాధిత మహిళను సఖీ సెంటర్‌కు పంపించామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

అడవిలో నివాసం ఏర్పర్చుకున్న వ్యక్తుల అరెస్ట్



అటవీశాఖ అధికారుల అదుపులో గిరిజనులు

జన్నారం: అడవిలో అక్రమంగా నివాసం ఏర్పాటు చేసుకున్న పలువురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజోద్దీన్ తెలిపారు. జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి అటవీ రేంజ్ సోనాపూర్ బీట్ పరిధి కంపార్టుమెంట్ 249లో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పది మంది అక్రమంగా నివాసం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. పులి సంచరిస్తున్నందున మానవ, వన్యప్రాణి హాని జరుగకుండా వన్యప్రాణి, అటవీ చట్టం ప్రకారం లింగాపూర్, జైనూర్, సిర్పూర్ మండలాలకు చెందిన కుమ్రం లక్ష్మణ్, సిడాం మోతిరాం, మెస్రం గంగరాం, నైతం మాన్కు, తొడసం విష్ణు, సిడాం బాలు, ఆత్రం లాల్‌సావ్, పెందోర్ సురేబాన్, పెందోర్ జలపతిరావు, కనక చంద్రభాన్‌లను అరెస్ట్ చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

జ్వరంతో వివాహిత మృతి



రాజేశ్వరి(ఫైల్)

తిర్యాణి(ఆసిఫాబాద్): విష జ్వరంతో తిర్యాణి మండలం సుంగాపూర్ పంచాయతీలోని ఎస్సీ కాలనీకి చెందిన దుర్గం రాజేశ్వరి(27) మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్వరికి ఎనిమిదేళ్ల క్రితం ఆసిఫాబాద్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌తో వివాహమైంది. భర్త శ్రీకాంత్ హైదరాబాద్‌లో పనిచేస్తుండగా.. రాజేశ్వరి సుంగాపూర్‌లోని తల్లి వద్ద ఉంటోంది. రాజేశ్వరికి మూడు రోజుల క్రితం జ్వరం రాగా కుటుంబ సభ్యులు స్థానికంగా ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు సాత్విక్(3), శ్రీహాన్ (10 నెలలు) ఉన్నారు. చిన్నారులు కన్నతల్లి మృతదేహంపై పడి రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. రాజేశ్వరి మృతితో సుంగాపూర్ గ్రామంలో విషాదం నెలకొంది.

రక్త కణాలు తగ్గి యువతి..



ప్రీతి(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని ఏపీ నగర్‌కు చెందిన చంద్రే ప్రీతి(22) డెంగీతో గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. ప్రీతి వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. పరిస్థితి విషమించడంతో పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. రక్త కణాల సంఖ్య పడిపోవడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన యువతి శుక్రవారం పీజీ ఎంట్రన్స్ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, అంతలోనే మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

శనిగకుంట మత్తడి పేల్చేసిన నిందితుల అరెస్ట్

- డ్రిల్లింగ్ మిషన్, ట్రాక్టర్, జిలిటెన్ స్టిక్స్ స్వాధీనం
- మంచిర్యాల డీసీపీ భాస్కర్



సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

చెన్నూర్: మంచిర్యాల జిల్లా శనిగకుంట మత్తడి పేల్చేసిన ఘటనలో చెన్నూర్‌కు చెందిన పెండ్యాల లక్ష్మినారాయణ ఉరఫ్ లక్ష్మణ్, భీమ్ మధుకర్, రాసమల్ల శ్రీనివాస్, మంచిర్యాల ఏసీసీ ప్రాంతానికి చెందిన గోగుల దానయ్యలను పోలీసులు అరెస్టు చేశారు. డ్రిల్లింగ్ మిషన్, ట్రాక్టర్, జిలిటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్ వివరాలు వెల్లడించారు. శనిగకుంట మత్తడిని ఈ నెల 16న గుర్తు తెలియని వ్యక్తులు పేల్చేశారని ఇరిగేషన్ ఏఈ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. శుక్రవారం ఉదయం చెన్నూర్ పట్టణంలోని బేతాళవాడకు చెందిన పెండ్యాల లక్ష్మినారాయణ ఇంటి వద్ద అతడితోపాటు అక్కడే ఉన్న భీమ్ మధుకర్, రాసమల్ల శ్రీనివాస్‌లను అదుపులోకి విచారించగా.. ఏసీసీ ప్రాంతానికి చెందిన గోగుల దానయ్యతో కలిసి మత్తడిని పేల్చేసినట్లు అంగీకరించారు. దానయ్యను చెన్నూర్ మండలం కిష్టంపేట శివారులో అరెస్ట్ చేసి కంప్రెషర్, డ్రిల్‌మిషన్ ట్రాక్టర్‌తోపాటు నాలుగు జిలిటెన్ స్టిక్స్, 50 మీటర్ల ఐరన్ జేపీ వైర్ స్వాధీనం చేసుకున్నారు.

కాలనీలోకి నీరు వస్తుందని..

శనిగకుంట చెరువు కింది భాగంలో బేతాళవాడ కాలనీ ఉంది. చెరువు పక్కనే ఉన్న 356 నుంచి 360 సర్వేనంబర్లలో 15.20ఎకరాల పట్టా భూములను చెన్నూర్‌కు చెందిన మంచాల రాజబాపు, నడిపల్లి లక్ష్మణ్‌రావు, లక్కం రాజబాపు, రాంలాల్‌గిల్డా, బత్తుల సమ్మయ్య, పెద్దంటి శ్రీనివాస్, పోగుల శేఖర్, ఎన్నం బానయ్య, ఇప్ప సంపత్, ఉమేశ్‌గిల్డా బృందంగా ఏర్పడి కొనుగోలు చేశారు. అనంతరం వీరు చెన్నూర్‌కు చెందిన గొడిసెల బాపురెడ్డికి విక్రయించారు. ఇందులో 4.20 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కాగా.. 11 ఎకరాలు చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉండడం రిజిస్ట్రేషన్ కాలేదు. వర్షాకాలంలో నీరు వస్తుందని చెరువు వైపు ఎత్తుగా మట్టి పోయించారు. దీంతో చెరువు నీరు దిగువ ప్రాంతమైన బేతాళవాడ చివరిగా ఉన్న నివాస గృహాలకు ముంపు సమస్య పెరిగింది. పెండాల్య లక్ష్మణ్ వాడ కావడంతో ముంపు సమస్య పరిష్కారానికి స్నేహితులు భీమ్ మధుకర్, రాసమల్ల శ్రీనివాస్‌లతో మత్తడి ఎత్తును డ్రిల్ చేసి తగ్గించాలని పథకం రచించారు. గోగుల దానయ్యను సంప్రదించగా రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ నెల 13న మత్తడిని డ్రిల్‌తో పగులగొట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. కాంక్రీట్‌తో నిర్మించిన మత్తడి కావడంతో జిలిటెన్ స్టిక్స్ పెట్టి పేల్చేద్దామని దానయ్య తెలిపాడు. నల్గొండలో తనకు తెలిసి వారి వద్ద జిలిటిన్ స్టిక్స్ ఉన్నాయని కొంత ఖర్చవుతుందని చెప్పగా.. భీమ్ మధుకర్ డబ్బులు పంపించాడు. ఈ నెల 16న రాత్రి డ్రిలింగ్ మిషన్‌తో రంధ్రాలు చేసి జిలిటెన్ స్టిక్స్‌తో పేల్చేశారని డీసీపీ వివరించారు. కేసు విచారణ సాగుతోందని, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ వ్యక్తుల ప్రమేయంపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. కేసును ఛేదించిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ రవీందర్, ఎస్సై శ్వేత, కానిస్టేబుళ్లు టిక్కయ్య, భూమన్న, హోంగార్డు ఖదీర్‌లను అభినందించారు.

దేగాంలో ఇద్దరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో వేర్వేరు కారణాలతో ఇద్దరు యువకుల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై శ్రీనివాస్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కోనేరు పోశెట్టి(26) కూలీ పనులుచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా భార్య, అత్తింటివారు వేధిస్తుండడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్యతో, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై..

దేగాం గ్రామానికి చెందిన దావుల నరేశ్(28) మద్యానికి బానిసై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నరేశ్ నిత్యం మద్యం తాగివచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. దీంతో ఐదు నెలల క్రితం భార పుట్టింటికి వెళ్లింది. మనస్తాపం చెందిన నరేశ్.. జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనస్థలానికిచేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానసిక స్థితి బాగాలేక..

దండేపల్లి: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన అనూష(32) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనూషకు 14ఏళ్ల క్రితం లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత ఆరేళ్లుగా ఆమె మానసిక పరిస్థితి బాగో లేక పిచ్చిగా ప్రవర్తిస్తోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేయగా.. కుటుంబ సభ్యులు కాపాడారు. ఇటీవల చింతపల్లిలోని తన పుట్టింటికి వచ్చిన ఆమె శుక్రవారం తెల్లవారుజామున కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు వెతుకగా.. ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. మృతురాలి తండ్రి గొర్ల తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

వ్యాధి నయం కావడం లేదని..

తలమడుగు: అనారోగ్యంతో ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఝరి గ్రామానికి చెందిన బూరుగు సుజాత (36) అనే వివాహిత పదేళ్లుగా నాలుక క్యాన్సర్‌తో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించినప్పటికీ తగ్గకపోవడంతో కొంతకాలంగా ఆమె మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి అందులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



పోశక్క మృతదేహం

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ గ్రామానికి చెందిన గోలెం పోశక్క(55) శుక్రవారం పిడుగుపాటుకు మృతిచెందింది. పొలం పనులు ముగించి సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వస్తుండగా ఆకస్మాత్తుగా పిడుగుపడింది. దీంతో పోశక్క అక్కడికక్కడే చనిపోయింది. ఆమె భర్త సింగరేణి కార్మికుడు కాగా కొన్నాళ్ల క్రితం మృతిచెందాడు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై డి.కిరణ్‌కుమార్ తెలిపారు.